# అసలు రహస్యం

## అమరనాథ్

రోడ్డు కడ్డంగా పడిపోయిన ముసల్హాణ్ణి చూడ్డంతోటే ఎక్కడి వాళ్ళక్కడ నిలబడి పోయారు మట్టి బొమ్మలాగ

అంతా చూస్తూండగానే వాడు గిలగిల కొట్టుకుని కొట్టుకుని చచ్చిపోయాడు అంతవరకూ ఎవ్వరూ కదల్లేదు! ఆ తరవాత మాత్రం అంతా దగ్గిరికి జేరారు.

ఒక గంట రెండు గంటలయేసరికి కదంతా తీర్థప్రదేశమల్లే ఐపోయింది. ఎవరికి తోచినట్లు వాళ్లు సానుభూతి పలుకుతున్నారు. కొత్తగా వచ్చినవాళ్లు మాత్రం దేవుణ్ణి చూడ్డానికి తాపత్రయ పడేభక్తుల్లాగ ఒకళ్లనొకళ్లు కుమ్ముకుంటున్నారు.

మరో అరగంటయేసరికల్లా హాస్పటల్ కారొచ్చాగిందక్కడ. డాక్టరుగారొక్క ఉరుకులో కిందికి దిగారు. బూటు కాళ్లతో ప్రజలను ఛేదించుకుంటూ గబగబా వెళ్లారు శవందగ్గరకి. శవం గుండెలమీద నిర్భయంగా చేతులువేసి వాడిముఖంలోకి కాసేపు పరీ..గా చూశారు. వెంటనే స్టెతస్కోపుతో ఆగిపోయిన వాడి గుండెను జాగ్రతగా పరీక్షించారు. కాస్సేపు గడ్డంక్రింద చెయ్యిపెట్టుకుని ఆలోచించారు. ఆతర్వాత మరొకసారి పరీక్షించారు ఏమనుకున్నారో ఏమిటో 'డ్రింగ్‌హిమ్‌దేర్' అంటూ కార్లో కూర్చున్నారు. అది 'బర్' మంటూ వెళ్లిపోయింది. అక్కడ గుమిగూడిన జనానికిదేమీ అర్థంకాక కారు వెనక్కాలలేస్తున్న ధూళికేసి తదేకదృష్టితో చూస్తున్నారు …… .

మరో అరగంట తర్వాత ముసలాడి శవం కూడా హాస్పటల్‌కి చేరింది. తరవాతేం జరిగిందో ఎవరికీతెలీదు, ఎవరిమట్టుకువాళ్లు వెళ్లి పోయారు.

రెండు రోజుల తరవాత "ఒక పండు ముసలి ఆకలి బాధకు తాళలేక నడిరోడ్డుమీద పడిమరణించిన విషాదసంఘటన యిచ్చటి ప్రజలకు తీరని వ్యధకలిగించిన"దంటూ వార్తాపత్రికలలో పడింది.

వెంటనే దాని నసత్యమైన వార్తగా ఖండిస్తూ, ఆహారపు కొరత వల్ల ఎవరూ మరణించలేదనీ, అల్లా మరణించే అవకాశాలు లేవనీ, ఎవరో అసందర్భంగా పుట్టిస్తున్నారనీ, ఒక అగ్రనాయకుడు ఉపన్యాసంమీద ఉపన్యాసం విసిరేశాడు.

దాంతో హఠాత్తుగా అర్ధరాత్రి సూర్యోదయమైనట్టు పత్రికల్లో మరొక ప్రకటన వెలువడింది. "యిచ్చట నడిరోడ్డుమీద పడివున్న ఒకముసలివాని శవమువెంటనే స్థానిక వైద్యాలయమునకు తీసుకొని పోబడి పరీక్షింపబడినది. చనిపోయిన వ్యక్తి గాలీ, నీరూ, లేక మాత్రమే మరణించె నని నిర్ధారణ చేయబడినది"

ఒకడు "ఓహో! అలాగా" అని ముక్కుమీద వేలేసుకున్నాడు.

ఇంకొకడు "నీమొహం! అని చీదరించుకొని వెళ్ళిపోయాడు.

మరొకడు "అంతా అయోమయం" అని ఆకాశం వైపు చూస్తూ నిలబడిపోయాడు.

ఆనందవాణి
పోస్టుబాక్సు నెంబరు
1583
—మేనేజరు